క్లుప్తంగా

అందరి సహకారంతో వాకర్స్ క్లబ్ అభివృద్ధి



వాకర్స్ క్లబ్ బోర్డు సమావేశంలో సభ్యులు

మురళీనగర్: అందరి సహకారంతో వాకర్స్ క్లబ్ అభివృద్ధి పథంలో పయనించిందని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. బుధవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్ అభివృద్ధికి సభ్యులు కష్టపడి పని చేసిన తీరును గుర్తు చేసుకున్నారు. అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా చేపట్టామన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఆర్.సత్యనాథం మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి ప్రస్తుత అధ్యక్షుడు చంద్రమౌళి కార్యదీక్షతతో పని చేశారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన క్లబ్ సభ్యులను అభినందించారు. అనంతరం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి రోణంకి నాగేశ్వరరావు, కేజీ కృష్ణారావు, కె.ద్వారకానాథ్, జి.విజయలక్ష్మి, ఎస్.రామ్మోహనరావు పాల్గొన్నారు.

జోరుగా గార్డెన్ పనులు



హైవే పక్కన గ్రీన్‌బెల్ట్‌లో జరుగుతున్న ఫ్లవర్ గార్డెన్ పనులు

సీతంపేట : జీవీఎంసీ 44వ వార్డు పరిధి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఫ్లవర్ గార్డెన్ పనులు జోరుగా జరుగుతున్నాయి. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హైవేకు ఆనికుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని పార్కులు, ఓపెన్ జిమ్‌లతో అందంగా తీర్చిదిద్దారు. దానిలో భాగంగా ఫ్లవర్ గార్డెన్ పనులు కూడా ప్రారంభించారు. మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు చాలా కాలం నిలిచిపోయాయి. మరలా కొద్ది రోజులుగా గార్డెన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పార్కులో నడిచేందుకు అనువుగా సిమెంట్ ఇటుకలు పేర్చారు. మొక్కలు నాటేందుకు వీలుగా సిమెంట్ జాళీలతో మడులు సిద్ధం చేశారు. మరికొద్ది రోజుల్లో గార్డెన్ పనులు పూర్తవుతాయని కార్పొరేటర్ తెలిపారు.

రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



పోర్టు స్టేడియంలో బిక్షగాడి వేషంలో రైతులకు సంఘీభావం తెలుపుతున్న ప్రసాదరావు

సీతంపేట: ఇటీవల సంభవించిన తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వాకర్స్ అసోషియేషన్ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు బిక్షగాడి వేషంలో రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా పథకాలు సకాలంలో అందజేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సబ్సిడీపై ఆధునిక పనిముట్లు సమకూర్చి, పంట చేతికి వచ్చాక గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. వ్యవసాయం లాభదాయకమని రైతులకు భరోసా కల్పించేలా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే రహదారిలో డంపర్‌బిన్



తిక్కవానిపాలెంలో రహదారికి అడ్డంగా డంపర్‌బిన్

రోడ్లపైనే డంపర్‌బిన్నులు

- రాకపోకలకు ఇబ్బందులు
- అధ్వానంగా పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు



55వ వార్డులో శిథిలావస్థకు చేరుకున్న కాలువ

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి నుంచి తాటిచెట్లపాలెం జాతీయ రహదారి సబ్‌వే మార్గంలో డంపర్ బిన్లు అడ్డంకిగా మారుతుండడంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జోన్ – 5 పబ్లిక్ హెల్త్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డంపర్ బిన్లు రహదారికి అడ్డంగా పెడుతున్నారు. చెత్తను తరలించే వాహనాలు డంపర్ బిన్లల్లో చెత్తను డంప్ చేసి యథాస్థానంలో పెట్టకుండా రోడ్డుకు మధ్యలో వదిలేసి పోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం, ఊర్వశి కూడలికి వెళ్లే గ్రీన్‌బెల్ట్‌కు ఆనుకుని ఉన్న సబ్‌వే మార్గాల్లో పరిస్థితి మరీ దారుణంగా కనిపిస్తోంది. గ్రీన్‌బెల్ట్‌లో భారీ చెట్లు, ఆపై విద్యుత్ దీపాల వెలుగులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. చీకటి పడితే అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. చెత్త తరలింపు తర్వాత ఓ పక్కకు డంపర్‌బిన్లు పెట్టాలని స్థానికులు కోరుతున్నా లారీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. రహదారికి మధ్యలో ఉండడం వల్ల ఇటీవల కాలంలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు డంపర్ బిన్లు నుంచి వచ్చే దుర్వాసన భరించలేక నిత్యం ముక్కుమూసుకునే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సమస్యలపై శానిటరీ విభాగం అధికారులకు, సచివాలయ కార్యదర్శులకు, జోన్ – 5 పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్‌కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దోమలు, పందులకు ఆవాసం

తాటిచెట్లపాలెం-కంచరపాలెం పరిధిలో ధర్మానగర్, తిక్కవానిపాలెం, గాంధీనగర్, రెడ్డికంచరపాలెం, జోగారావునగర్ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. దీంతో ఎక్కడికక్కడే గెడ్డల్లో చెత్త పేరుకుపోయింది. కాలువలు, గెడ్డల్లో వ్యర్థాలు పూడుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. మరోవైపు దోమలు విజృంభించడం, పందుల స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి సంజీవయ్యకాలనీ నుంచి ధర్మానగర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో పారిశుధ్య లోపించడంతోపాటు కాలువల్లో వ్యర్థాలు తొలగించకపోవడంతో దోమల స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు కుట్టడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా పందుల సంచారం ఎక్కువైపోయిందని, వీధుల్లో తిరగాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. గెడ్డల్లో ఎప్పటికప్పుడు పూడిక తొలగించకపోవడంతో చెత్త పేరుకుపోతోందని చెబుతున్నారు. చిన్నపాటి వర్షాలకే వ్యర్థాలు రహదారులపైకి వచ్చేస్తున్నాయని... ఇప్పటికైనా సంబంధిత పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు పర్యవేక్షించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ధర్మానగర్‌లో అధ్వానంగా తయారైన గెడ్డలో పంది

ప్రమాదాలు జరుగుతున్నాయి

జాతీయ రహదారి సబ్ వే మార్గంలో జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగానికి సంబంధించిన డంపర్ బిన్లు అడ్డంగా ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రీన్‌బెల్ట్‌కు ఆనుకుని డంపర్ బిన్లు తొలగించాలని ఫిర్యాదులు చేసినా పారిశుధ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– వై.ఎస్.రాజు, ధర్మానగర్

అధికారులు స్పందించాలి

జీవీఎంసీ 55వ వార్డులో పారిశుధ్య నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ లోపించింది. సమస్యలపై జోన్ – 5 పబ్లిక్ హెల్త్ అధికారులు పర్యవేక్షించకపోవడంతో డంపర్‌బిన్లు రహదారికి అడ్డంగా వదిలేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, పూడిక గెడ్డల్లో పేరుకుపోయింది.

– ఎస్.సురేష్‌కుమార్, రెడ్డికంచరపాలెం

పైప్‌లైన్ లీకేజీతో అవస్థలు



లీకవుతున్న పైప్‌లైన్ వద్ద గతంలో తవ్విన గొయ్యి

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులో గల బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో మంచి నీటి పైప్‌లైన్ లీకవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడి అభయాంజనేయస్వామి దేవస్థానం ఆర్చి ఎదురుగా పైప్‌లైన్ మరమ్మతుల కోసం కొద్ది రోజుల క్రితం గొయ్యి తవ్వారు. కానీ పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకపోవడంతో పనులు ఇంకా పూర్తి కాలేదు. ఫలితంగా ఇక్కడ రోజూ అధిక పరిమాణంలో మంచినీరు లీకవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడి మెయిన్‌రోడ్డులో పనులు మధ్యలోనే వదిలేయడంతో రాత్రిపూట గొయ్యి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గొయ్యి చుట్టూ కాంక్రీట్ వ్యర్థాలు కూడా అలాగే నిర్లక్ష్యంగా వదిలేయడం తీవ్ర దుమారం రేపుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 మంచినీటి సరఫరా విభాగం ఇంజినీర్లు స్పందించి మరమ్మతులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి నిందితులకు రిమాండ్

సీతమ్మధార : గంజాయితో పట్టుబడిన నలుగురు నిందితులకు న్యాయస్థానంలో న్యాయమూర్తి రిమాండ్ విధించారు. హబీబుర్ రెహమాన్, రజీబ్ ఎస్‌కే, షహబుల్ మండల్, అలీ అనే నలుగురు కలిసి 6 బ్యాగుల్లో 28 కిలోల గంజాయి రాయగడలో కొనుగోలు చేసి కేరళలో రాఖీ అనే వ్యక్తికి ఇవ్వడానికి వెళ్తున్నారు. మార్గ మధ్యలో విశాఖపట్నం రైల్వేస్టేషన్ సమీప శ్రీనివాస కల్యాణ మండపం వెనుక మంగళవారం ఉండగా ఫోర్త్‌టౌన్ పోలీస్‌లు ముందస్తు సమాచారంతో దాడి చేసి ఆ నలుగురిలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అలీ అనే వ్యక్తి పరారయ్యాడు. వారి నుంచి 28 కేజీల గంజాయి సీజ్ చేశారు. ముగ్గురినీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి బుధవారం రిమాండ్ విధించారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ లక్ష్మణ నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

యువతతోనే అవినీతిరహిత సమాజం

ఆరిలోవ : ప్రతి ఒక్కరూ చేసే పనిని దేశానికి అంకితం చేయగలిగేలా ఉండాలని ఇంటర్నేషనల్ మోటివేషనల్ టీచర్ అజిత్‌కుమార్ సూచించారు. శ్రీకృష్ణాపురం గురుకులాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ – 2047 అవగాహన సభలో మాట్లాడారు. విద్య, వ్యాపారం, క్రీడలు తదితర అంశాలు గురించి వివరించారు. ఆయా రంగాల్లో రాణించి అద్భుతాలు సృష్టించిన వ్యక్తులు దేశానికి ఎలాంటి సేవలు అందిస్తున్నారో తెలియజేశారు. శాస్త్రవేత్తలు ఏ విధంగా దేశానికి మంచి పేరు తీసుకొచ్చారో వివరించారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు 2047 నాటికి దేశానికి అంకితం చేసే సేవలో నిలవగలగాలని సూచించారు. ప్రతి పని చేయడానికి లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ లక్ష్యాన్ని సాధించడానికి క్రమశిక్షణ, పట్టుదల, కృషి, దీక్ష, ఏకాగ్రత కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం సమాజం అవినీతితో ఉందని, అవినీతి లేని సమాజాన్ని నిర్మించే సత్తా యువతకు మాత్రమే ఉందన్నారు. ఉపాధ్యాయులు రాజ్యాంగంలోని అంశాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. దేశంలో 15 సంవత్సరాల నుంచి పేద యువతే క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం

అల్లిపురం: కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచి ప్రజలపై భారం వేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులను ప్రజలు, వ్యాపారులందరూ బహిరంగా దగ్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జగదాంబ దరి సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీలు, ఇంధన చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో నలభై శాతం ప్రజలపై భారం మోపిందన్నారు. చిన్న షాపుల యజమానులు గత నెలలో రూ.600 కడితే డిసెంబర్‌లో రూ.1100 బిల్లు వచ్చిందన్నారు. 40 నుంచి 80 శాతం వరకు భారీగా రేట్లు పెంచారన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు మోపితే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వ్యతిరేకించారన్నారు. అలాగే స్మార్ట్ మీటర్లు పెడితే వాటిని ధ్వంసం చేయండని లోకేష్ పిలుపునిచ్చారన్నారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట వచ్చాక ఇంకొక మాట మాట్లాడటం సరి కాదన్నారు. అదే విధంగా గంగవరం పోర్టును స్వాధీనం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పింఛన్, ఉపాధి హామీ పథకంలో కోతలు పెట్టేందుకు కొత్తగా సర్వేలు జరపడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. విశాఖ పోర్టులో డ్రగ్స్ షిప్‌ను పట్టుకున్న సీబీఐ ఇప్పుడు ఆ షిప్‌లో ఏమీ లేదని తేల్చడం వెనుక మహా కుంభకోణం ఉందన్నారు. టన్నుల కొద్దీ రేషన్ బియ్యం కాకినాడ, విశాఖ పోర్టుల నుంచి అక్రమంగా తరలిపోతుండగా పట్టుకున్న కూటమి ప్రభుత్వం ఏ ఒక్కరిపైనా కేసులు పెట్టలేదన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొని మాట్లాడారు.

బాలసంజీవని పంపిణీ



మహిళలకు బాల సంజీవని సరకులు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

సీతమ్మధార : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలసంజీవని నెల వారీ సరకులను బుధవారం అందజేశారు. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపం దరి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు సోడిపిండి రెండు కిలోలు, అటుకులు కిలో, చెక్కీలు పావుకిలో, బెల్లం పావు కిలో, ఎండు ఖర్జూరం పావు కిలో, బియ్యం మూడు కిలోలు, కందిపప్పు కిలో, అర కిలో నూనె వంతున అందజేశారు. అలాగే 25 గుడ్లు, ఐదు లీటర్ల పాలు వంతున అందజేశారు. ఈ కేంద్రంలో గల 30 మంది గర్భిణులు, 33 మంది బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్త గౌరి సరకులు అందజేశారు.

తప్పిన ప్రమాదం

సీతమ్మధార : నగరంలోని రామాటాకీస్ వద్ద పెను ప్రమాదం తప్పింది. రామాటాకీస్ వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని, కారును ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి 10 : 30 గంటల సమయంలో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు కిందకి ద్విచక్ర వాహనం వెళ్లిపోవడంతో దాన్ని తీసేందుకు ప్రయత్నిస్తుండగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. అర్ధగంటపాటు వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

బీచ్‌రోడ్డు: గుర్తు తెలియని మృతదేహాన్ని ఆర్కే బీచ్‌లో స్థానికులు గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం తెల్లవారు జామున వాకింగ్ చేస్తున్న స్థానికులు ఆర్కే బీచ్ వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని చూశారు. వారిచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో నిర్వాహకులు, నిపుణులు

విశాఖ విద్య: పరిశోధనలపై మరింత అవగాహన పెంచుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ సూచించారు. ఐఐపీఈలో 'తుప్పు నివారణ వ్యూహాలు'పై మూడు రోజులు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిపుణులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు ప్రసంగించారు. ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ తుప్పుకు సంబంధించిన పారిశ్రామిక సవాళ్లను ఎదుర్కోవడంలో ఇన్‌స్టిట్యూట్‌లో కొనసాగుతున్న ప్రయత్నాలను వివరించారు. వర్క్‌షాప్ వాస్తవ ప్రపంచ పారిశ్రామిక సమస్యలకు వర్తించే కార్యాచరణ పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని, పరిశోధన సాంకేతికతను అభివృద్ధి చేయడంలో నిబద్ధతను బలోపేతం చేస్తుందన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ దీపాంకర్ పాల్ మాట్లాడుతూ విద్యా పరిశోధన, పారిశ్రామిక పద్ధతుల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రిజిస్ట్రార్ రాంఫాల్ ద్వివేది, డీన్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జీవితానికి మహత్తర ఔషధం భగవద్గీత



అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్‌స్వామి

సీతమ్మధార : భగవద్గీత సారం తెలుసుకుని ఆచరిస్తే జీవితం రాత మారుతుందని ఆధ్యాత్మిక ఆచార్యులు, త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. వారీజ ఆశ్రమం, వికాస తరంగిణి సంయుక్తంగా సీతమ్మధారలో నిర్వహిస్తున్న గీతా జయంతి వేడుకల్లో జీయర్ స్వామీ భగవద్గీత పారాయణ చేయించారు. గత ఐదు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాలు బుధవారం ముగించారు. ఈ సందర్భంగా సుమారు ఐదు వేల మందితో సంపూర్ణ భగవద్గీత పారాయణ చేయించారు. విశాఖలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. ఒక్కో స్కూల్‌కు ఒక అధ్యాయం కేటాయించి, 108 మంది విద్యార్థులను ఎంపిక చేసి, అందరికీ తప్పులు లేకుండా చదివేలా ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. వాళ్లంతా బుధవారం పారాయణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతా పారాయణ వైభవం, చదవాల్సిన అవసరం స్వామీజీ తెలిపారు. మానవ జీవితానికి మహత్తర ఔషధంలా భగవద్గీత పనిచేస్తుందని వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

మంచి ఆలోచనలతో ఉజ్వల భవిష్యత్

ఉత్తరాంధ్ర వాసులపై ఆచార్యులు చినజీయర్ స్వామి అమితమైన అనుగ్రహం కురిపించారని వికాస తరంగిణి కమిటీ సభ్యులు, సీనియర్ శిక్షకులు అరుణ అన్నారు. గత ఐదు రోజులుగా విశాఖపట్నంలో నిర్వహిస్తున్న గీతా జయంతి వేడుకల ముగింపు సందర్భంగా ఆమె ఆనందం వ్యక్తం చేశారు. నేటి తరం యువత సక్రమమైన ఆలోచనలతో ముందుకు సాగితేనే మంచి భవిష్యత్ లభిస్తుందన్నారు. ఆలోచనలు సక్రమంగా లేని కారణంగా ఆత్మనూన్యతకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి చెడు ఆలోచనలు రాకుండా ఉండడానికి భగవద్గీత మంచి ఔషధంలా పనిచేస్తుందన్నారు. నేటి తరం విద్యార్థులకు సక్రమమైన ఆలోచనలు కలగాలనే సంకల్పంతో విద్యార్థులచే పారాయణ చేయించారన్నారు. పాల్గొన్న విద్యార్థులకు మంచి భవిష్యత్ లభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

విజయవాడస్పోర్ట్స్: రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులను ఏమార్చి వారి జేబుల్లో నగదు అపహరిస్తున్న ముఠాను విజయవాడ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వన్‌టౌన్‌లోని సీసీఎస్ స్టేషన్ వద్ద క్రైం ఏసీపీ వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు. విశాఖపట్నం, గోపాలపట్నంకు చెందిన బుర్రి సురేష్, అరిటాకుల తారకేశ్వరరావు, కైలాసపురానికి చెందిన కంబాల శ్రీను, కొబ్బరితోటకు చెందిన బుడుమూరి రాజు స్నేహితులని, గతంలో వీరు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి జైలు జీవితం అనుభవించారని చెప్పారు. ఈ నలుగురు రద్దీ ప్రదేశాలను ఎంచుకుని అక్కడ ఎవరి వద్ద డబ్బులు ఎక్కువ ఉన్నాయో గ్రహించి, జేబులో నగదును ముఠాలోని ఒక వ్యక్తి దొంగిలించే సమయంలో మిగిలిన ముగ్గురు తోపులాట జరుగుతున్నట్లు, రద్దీ ఎక్కువగా ఉన్నట్టు అక్కడ వాతావరణాన్ని సృష్టిస్తారని తెలిపారు. ఈ తరహా చోరీలకు పాల్పడడంలో ఈ ముఠా ఆరితేరిందన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ ముఠా చోరీలకు పాల్పడుతుందన్నారు. ఈ నెల ఆరో తేదీన చల్లపల్లికి చెందిన ఓ వ్యక్తిని ఇదే మాదిరిగా ఏమార్చి అతని వద్ద ఉన్న డబ్బులు కాజేసినట్లు చెప్పారు. ఆస్పత్రిలో ఉన్న తన బావమరిది చికిత్స నిమిత్తం తీసుకొచ్చిన నగదును పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఈ ముఠా దొంగిలిచిందన్నారు. కృష్ణలంక పోలీసులకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేశామన్నారు. పక్కా సమాచారంతో బస్టాండ్ సమీపంలోని పద్మావతి ఘాట్ వద్ద బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సీసీఎస్ సీఐలు అబ్దుల్‌సల్లా, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సులతో ట్రాఫిక్ జామ్



రామాటాకీస్ రోడ్‌లో నిలిచిపోయిన వాహనాలు

సీతంపేట : రామాటాకీస్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్య మరలా మొదటికొచ్చింది. రామాటాకీస్ నుంచి సత్యం జంక్షన్‌కు వెళ్లే మార్గంలో రెండు వైపులా ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదరవుతున్నాయి. ఈ మార్గంలో ట్రావెల్ బస్సులను గంటల తరబడి నిలిపివేయడం వల్ల ఎదురవుతున్న సమస్యలపై గతంలో సాక్షిలో ప్రచురించిన వార్తకు నగర పోలీస్ కమిషనర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో ఈ మార్గంలో బస్సులు పది నిమషాలకంటే ఎక్కువ సేపు నిలపరాదని ద్వారకా పోలీసులు ట్రావెల్ బస్సుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి మరీ ఆదేశించారు. అయితే కొద్ది రోజులు బాగానే బస్సులు నిలపకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సహకరించారు. గత కొద్ది రోజులుగా మరలా కథ మొదటికొచ్చింది. గంటల తరబడి బస్సులు నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతోపాటు ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు సైతం బేఖాతరు చేయడంతో స్థానికులు, వాహన చోదకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మానవ హక్కులు కాపాడేందుకు కృషి



కార్యక్రమంలో పాల్గొన్న లా కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, తదితరులు

సీతంపేట : నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, సీనియర్ నావెల్ కమాండర్ కృష్ణకుమార్, ఏపీ హైకోర్టు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఛైర్మన్ పి.సంపత్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ హక్కులు కాపాడటంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ముందుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులు కాపాడుకునేందుకు ముందుకు రావాలన్నారు. అన్యాయం ఎక్కడ జరిగినా హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ గట్టిగా ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన పలువురిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి స్వప్న పాలక, వైస్ ఛైర్మన్ గుడివాడ కృష్ణ కిషోర్, అజయ్, కాండ్రేగుల లీలా హరిప్రసాద్, బుగత లీలా ప్రసాద్, రూప్‌నాథ్, కంటుభుక్త సత్యలక్ష్మి, ఆదిలక్ష్మి, మురళీమోహన్, ఓంకార్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు బంధువుల చెంతకు..



బాలుడిని బంధువులకు అప్పగిస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం : రైలులో ప్రయాణిస్తూ తప్పిపోయిన బాలుడిని రైల్వే పోలీసులు బంధువుల చెంతకు చేర్చారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మోహన్ సురేష్ అనే 12 సంవత్సరాల బాలుడు రాజమండ్రి నుంచి తమ ప్రాంతం పొందూరుకు పెద్దన్నయ్య, బంధువులతో కలిసి వెళ్తున్నాడు. రైలు విశాఖపట్నం వచ్చేసరికి ఎవరికీ చెప్పకుండా ఆ బాలుడు దిగిపోయాడు. వెంటనే బంధువులు రైల్వే పోలీసులకు సమాచారమివ్వగా జీఆర్పీ సిబ్బంది బాలుడిని వెతికి బంధువులకు అప్పగించారు. బాలుడికి మతిస్థిమితం లేదని, వెంటనే గుర్తించి, అప్పగించిన పోలీసులకు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.